క్లుప్తంగా

బీసీలకు రాజ్యం.. జగనన్నకే సాధ్యం


చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

రామచంద్రపురం రూరల్: బీసీలకు రాజ్యం జగనన్నకే సాధ్యం అని రాష్ట్ర బీసీ సంక్షేమ సినిమాటోగ్రఫీ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. నియోజకవర్గాల సమన్వయకర్తల రెండో జాబితా ప్రకటన సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 2014 ఎన్నికల సమయంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శెట్టిబలిజ సామాజిక వర్గానికి రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబును కోరగా.. సీట్లిస్తే మీ శెట్టిబలిజలు గెలుస్తారా అని శెట్టిబలిజ సామాజిక వర్గాన్ని చంద్రబాబు అవమానించి, అవహేళన చేశారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రామచంద్రపురం అసెంబ్లీ స్థానాన్ని సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ తనయుడు సూర్యప్రకాష్‌కు, రాజమహేంద్రవరం రూరల్ స్థానాన్ని తనకు, పాలకొల్లు అసెంబ్లీ స్థానాన్ని గుడాల గోపి, రాజమండ్రి సిటీ స్థానాన్ని గీత బిడ్డ మార్గాని భరత్‌రామ్‌లను ఎంపిక చేయడం ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారన్నారు.

పరిశీలనలో ఓటు నమోదు దరఖాస్తులు

కపిలేశ్వరపురం (మండపేట): గత వారం రోజులుగా నియోజకవర్గంలో ఓటు హక్కు కోసం అందజేసిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని ఓటు నమోదు అధికారి వి.మదన్ మోహన్ రావు తెలిపారు. మండపేటలో మంగళవారం నియోజకవర్గంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. తమకు అందిన దరఖాస్తుల వివరాలు, ఈవీఎం యంత్రాలు ద్వారా ఓటు వేసే విధానంపై ప్రచార కార్యక్రమాలను వివరించారు. రాజకీయ నాయకులు అడిగిన అనుమానాలను నివృత్తి చేశారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కె.గంగవరం: కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందని వాటిని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ యువ నాయకులు కాదా వీర వెంకటరమణ అన్నారు. మండలంలోని సుందరపల్లిలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన గ్రామ సభలో అధికారులు, బీజేపీ నాయకులు పాల్గొని మాట్లాడారు. రమణ మాట్లాడుతూ అర్హులందరికీ గ్యాస్ కనెక్షన్ ఇవ్వడంతో పాటు సబ్సిడీపై గ్యాస్ సిలిండర్‌ను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీంతో పాటు వైద్య రంగంలో కూడా పేదలకు రాయితీలను, సబ్సిడీపై బియ్యాన్ని అందిస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. ఈఓపీఆర్‌డీ నాగేంద్ర, తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మ, సర్పంచ్‌లు సలాది శిరీష, కన్వీనర్ రెడ్డి జయరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలి

కాజులూరు: దాళ్వా సాగుకు రైతులు చొరవ చూపాలని మండల వ్యవసాయధ/ కారి(ఏవో) వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెంలో జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31 నాటికి గోదావరి డెల్టా కాలువలకు నీరు నిలుపుదల చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అయితే ఈ ఏడాది వర్షాలు కారణంగా జాప్యం జరుతుందని కనీసం ఈ జనవరి మొదటివారం పూర్తయ్యేనాటికైనా మండల గ్రామాల్లో వెదజల్లు, నాట్లు పూర్తి చేయాలన్నారు. దాళ్వా సాగుకు సమయం తక్కువ ఉన్నందున రైతులు వెద జల్లు విధానానికి ప్రాధాన్యం ఇవ్వాలని తక్కువ రోజుల్లో కోతకు వచ్చే పంట రకాల వరిని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, పార్టీ మండల యువజన విభాగ కార్యదర్శి నిమ్మితి విజయ్, తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి, పలువురు రైతులు పాల్గొన్నారు.

రేవు శ్రీనుకు మాతృ వియోగం


సూర్యకాంతం భౌతికకాయం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు పప్పుల మసేను వెంకన్న(రేవు శ్రీను)కి మాతృ వియోగం జరిగింది. ఆయన తల్లి సూర్యకాంతం (92) మంగళవారం మృతి చెందారు. ఆమె భౌతిక కాయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సందర్శించి నివాళులర్పించారు. గ్రామ పెద్దలు, బంధువులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను ఎదిరించిన ధీశాలి


ఉపాధ్యాయినులు

- దేశంలో తొలి ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే
- నేడు మహిళా ఉపాధ్యాయ దినోత్సవం

రాయవరం: మహిళల హక్కుల కోసం పోరాడిన ధీశాలి సావిత్రీబాయి పూలే. భర్త మహాత్మాజ్యోతిరావ్ పూలేతో కలసి కులవ్యవస్థకు వ్యతిరేకంగా సత్యశోధనకు 1873లో 'సత్యశోధక్ సమాజ్'ను సావిత్రీబాయి పూలే ప్రారంభించారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయినిగా పనిచేసిన ఆమె మహిళల హక్కులే మానవ హక్కులని చాటి చెప్పారు. బాల్య వివాహాలకు, మూఢ నమ్మకాలకు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని సావిత్రీబాయి పూలే నడిపారు.

విద్యా వ్యాప్తికి కృషి

మహారాష్ట్రలోని సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో జన్మించిన సావిత్రీబాయి పూలే కుల మత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమ స్వరూపిణిగా నిలిచారు. దేశంలో విద్యా ఉద్యమం ప్రారంభించిన తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే. 18 ఏళ్ల వయస్సులోనే స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి చేశారు. ఆమె జీవిత కాలంలో 52 మహిళా పాఠశాలలను ప్రారంభించారు. భారత తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జన్మదినమైన జనవరి మూడున మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతుంది. సావిత్రిభాయి పూలే జయంతి సందర్భంగా పలువురు మహిళా ఉపాధ్యాయినుల అభిప్రాయాలతో కథనం.

చదువు విలువ చాటి చెప్పారు



సమాజంలో మహిళలు విద్యావంతులైనప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్న విషయాన్ని గుర్తించడం గొప్ప విషయం. ప్రతి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని, విద్యాభివృద్ధికి కృషి చేయాలి.
– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శం



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఉపాధ్యాయ లోకానికే స్ఫూర్తిదాయకం. అలాగే మహిళా ఉపాధ్యాయులకు సావిత్రీబాయి పూలే ఆదర్శంగా నిలుస్తారు. సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని, ఆమె బాటలో నడవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి.
– తెలగాని మెహర్‌సుజాత, జెడ్పీహెచ్ఎస్, ద్రాక్షారామ

మహిళల స్థితిగతులను మార్చారు



దేశం సంతోషం, సంక్షేమం గురించి శ్రద్ధ వహించే వారు కచ్చితంగా మహిళల స్థితిగతులపై శ్రద్ధ వహించాలి. అటువంటి కోవలో సావిత్రీబాయి పూలే ఉన్నారు. బాలికా విద్యను ప్రోత్సహించే క్రమంలో సావిత్రీబాయి పూలే అడ్డంకులను అధిగమించి చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం. సావిత్రీబాయి పూలే చూపిన బాటలో నడవడమే ఆమెకు ఇచ్చే ఘన నివాళులు.
– వి.నాగేశ్వరి, ఎంఈవో, రామచంద్రపురం

నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యం


సమావేశంలో మాట్లాడుతున్న కె.గంగవరం ఎంపీపీ నాగమణి


కాజులూరులో రోగులకు జగనన్న కిట్ ద్వారా మందులు పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు


రాయవరం మండలం వి.సావరం సురక్ష వైద్య శిబిరంలో కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటరమణ

కె.గంగవరం: ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ప్రజా ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మండలంలోని సుందరపల్లి సచివాలయం వద్ద మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రాథమిక వైద్య పరీక్షల ద్వారా అనారోగ్య సమస్యల్ని గుర్తించి, వారికి ఉచితంగా వైద్యం అందించడంతో పాటు సలహాలు, సూచనలు కూడా వైద్య సిబ్బంది ఇస్తారన్నారు. ప్రభుత్వం ఆరోగ్యనికి పెద్దపీట వేసిందని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం ఇంటి వద్దకే అందించేందుకు ఇప్పటికే ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. దీనిలో భాగంగా ప్రతి సచివాలయం పరిధిలో వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణం చేపట్టి పూర్తి స్థాయి వైద్యులను నియమించడంతో పాటు మందులను అందుబాటులో ఉంచారన్నారు. ప్రస్తుతం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో ప్రతి ఒక్కరికి ఆరోగ్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందిస్తున్నారని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ సలాది శిరీష, కన్వీనర్ రెడ్డి జయరాజు, సొసైటి అధ్యక్షులు సాదా వెంగళరావు గ్రామ పెద్దలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే సీఎం జగన్ లక్ష్యం

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాలను రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని ఎంపీపీ మాత భారతి అన్నారు. కాజులూరు సచివాలయం-3 ఆవరణలో మంగళవారం దుగ్గుదుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి వై.సుప్రియ ఆధ్వర్యంలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల్లో దివంగత వైఎస్సార్ తర్వాత ప్రజల ఆరోగ్యం కోసం పరితపించిన వ్యక్తి సీఎం జగన్ మాత్రమేనన్నారు. సీఎం జగనన్న సంక్షేమ పథకాలతో పాటు ప్రజా ఆరోగ్య పరిరక్షణ కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్సు సేవలు, ఫ్యామిలీ డాక్టర్, 104 వైద్య సేవలు, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్సార్ కంటి వెలుగు పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వాటితో పాటు వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 10032 విలేజ్ హెల్త్‌సెంటర్లు, 17 మెడికల్ కళాశాలలు నిర్మించి ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలలో 53800 స్పెషలిస్టు డాక్టర్లను, నర్సులను నియమించారన్నారు. ప్రజారోగ్యం కోసం ఇంత పెద్ద ఎత్తున పథకాలు రూపొందిస్తున్నా ఇంకనూ గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారనే భావనతో ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రూపొందించారన్నారు. డాక్టర్ హిమబిందు, జి.భారతి, జి.స్వాతి, ఎస్.సత్తిబాబు తదితర నిపుణులైన వైద్యులు పాల్గొని పౌరులందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దండంగి సరోజని, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు యాళ్ళ సత్తిబాబు, చైతన్య, మాత మురళి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వ ప్రాధాన్యం

రాయవరం: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ కోరారు. మండలంలోని వి.సావరంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్-2 నిర్వహించారు. సర్పంచ్ కాకి కృష్ణవేణి, ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో ఎంపీపీ వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యానికి ఇస్తున్న ప్రాధాన్యతను దేశం మొత్తం చూస్తోందన్నారు. ఈ వైద్య శిబిరంలో ప్రభుత్వ వైద్యులు రమ్యశ్రీ , ఆలీ, అనిరుధ్‌తో పాటుగా చాణక్య ఆస్పత్రి అధినేతలు డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి, డాక్టర గోపీరవితేజ, డాక్టర్ ప్రత్యూషలు వైద్యసేవలు అందించారు. గ్రామానికి చెందిన 276 మంది వైద్య శిబిరంలో వైద్య సేవలు పొందారు. గత నెలలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో నేత్ర పరీక్షలు చేయించుకున్న వారికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం.నారాయణరెడ్డి, ఎంపీటీసీ మేడిశెట్టి నాగమణి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిరికి కృష్ణారావు, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నేతలు పంపన గోవిందు, మండ హరినాధరెడ్డి పాల్గొన్నారు.

తాపేశ్వరంలో సీసీ రోడ్డు పనుల పరిశీలన


రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ తోట, పృథ్వీరాజ్, పాపారాయుడు

కపిలేశ్వరపురం (మండపేట): తాపేశ్వరంలో జరుగుతున్న సీసీ రహదారి నిర్మాణ పనులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మంగళవారం పరిశీలించారు. వైఎస్సార్ సీపీ యువనేత, ఎమ్మెల్సీ తనయుడు తోట పృథ్వీరాజ్, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు జెడ్పీటీసీ సభ్యురాలు కురుపూడి భవాని, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణలతో కలిసి రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట పట్టణ కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, సురుచి ఫుడ్స్ చైర్మన్ పోలిశెట్టి మల్లిబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు నాగిరెడ్డి, ఎంపీటీసీ పద్మారావు, వనుం నారాయణ, ఉన్నారు.

8వ రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

కపిలేశ్వరపురం (మండపేట): తమ డిమాండ్ల సాధనకు మండపేట పురపాలక సంఘ కార్మికులు చేస్తున్న సమ్మె మంగళశారం ఎనిమిదో రోజుకు చేరుకుంది. కార్మిక సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా పట్టణంలోని నిరసన శిబిరంలో ఒంటికాలిపై నిలుచుని కార్మికులు నిరసన తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు ప్రగతిశీల ప్రజాస్వామ్య సంఘాలు ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.

సెలవులకు సెలవు ఇచ్చిన శ్రీనివాస్

ఘనంగా సత్కరించిన ఉపాధ్యాయులు


ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రామారెడ్డి, రామలక్ష్మణమూర్తి, ఉపాధ్యాయులు

రాయవరం: పసలపూడి మండల పరిషత్ ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు కాళిశెట్టి శ్రీనివాస్ 2023 సంవత్సరంలో ఒక్క సెలవు కూడా తీసుకోకుండా, విధులకు హాజరయ్యారు. ఈ క్రమంలో శ్రీనివాస్‌ను మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. హెచ్ఎం కోరుమిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన అభినందన సభలో పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, ఎంఈవో-1 పి.రామలక్ష్మణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రామారెడ్డి, రామలక్ష్మణమూర్తిలు మాట్లాడుతూ శ్రీనివాస్‌ను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ భగవంతుని ఆశీర్వాదం, అర్ధాంగి సహకారంతో ఒక్క సెలవు కూడా వినియోగించుకోకుండా విధులకు హాజరైనట్లు తెలిపారు. అనంతరం శ్రీనివాస్‌ను దుశ్శాలువా, పూల మాలలు, జ్ఞాపికతో రామారెడ్డి, రామలక్ష్మణమూర్తి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.విజయకుమార్, నల్లమిల్లి భాస్కరరెడ్డి, ఎస్.సూరిబాబు, ఎం.రాజు, యూటీఎఫ్ మండల శాఖ ప్రధాన కార్యదర్శి జి.మురళీకృష్ణ తదితరులు హాజరయ్యారు.

జానకిరామయ్య సేవలు చిరస్మరణీయం

రామచంద్రపురం: పట్టణానికి చెందిన ప్రముఖ క్రిమినల్ లాయర్, రాజకీయ నాయకుడు, క్రీడాకారుడు దివంగత పిల్లా జానకిరామయ్య సేవలు చిరస్మరణీయమని వైద్యుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అన్నారు. స్థానిక బార్ అసోసియేషన్ భవనంలో జానకిరామయ్య కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో డాక్టర్ స్టాలిన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ పట్టణంలో ఉచిత న్యాయ సహాయం అందించిన వ్యక్తిగా, తొలిసారిగా క్రికెట్ అసోసియేషన్ స్థాపించిన వ్యక్తిగా, రాజకీయ రంగానికి ఎంతో మందిని పరిచయం చేసిన వ్యక్తిగా జానకిరామయ్య పలు రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. జానకిరామయ్య శిష్యులు, న్యాయవాదులు ఉండవల్లి గోపాల్, కేవీ కృష్ణ, ఉండమట్ల శ్రీను, గాలింకి చిట్టిబాబులు జానకిరామయ్య సేవలు గుర్తు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు డీఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ చిన్నం వీర్రెడ్డి, కోశాధికారి చక్రవర్తి, మహిళా న్యాయవాదుల ప్రతినిధి కావూరి వెంకట సత్యవాణి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామ తులసి, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



రామచంద్రపురం బార్ అసోసియేషన్ భవనంలో నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరిస్తున్న డాక్టర్ స్టాలిన్ తదితరులు

పార్టీ గెలుపునకు ఐక్యంగా కృషి చేయాలి

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


మండపేటలో పార్టీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న ఎన్నికల్లో బీసీలందరూ ఐక్యతతో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన కుక్కల శ్రీనివాస్ మంగళవారం మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. తన నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌ను శాలువాతో ఎమ్మెల్సీ తోట సత్కరించారు. తోట మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గీయులకు సీఎం వైఎస్ జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, సంక్షేమ పాలనలో బీసీలు సామాజికంగా అభివృద్ధి చెందుతున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ పెంకే గంగాధర్, కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, నీలం దుర్గ, మారేడుబాక సర్పంచ్ మట్టపర్తి గోవిందరాజు, పట్టణ శెట్టి బలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్, చొల్లంగి గోవింద్ పాల్గొన్నారు.

చురుగ్గా పోతురాజు ఆలయ అభివృద్ధి పనులు


ఆలయ గట్టు విస్తరణ పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): కేశవరం గ్రామంలోని గని పోతురాజు ఆలయ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో ఆలయ ఆవరణ విస్తరణ నిర్మాణానికి మార్గం సుగమం అయ్యింది. దీంతో ఆలయం నుంచి చెరువు గండి వరకూ 20 అడుగుల వెడల్పు గల గట్టును 60 అడుగులకు విస్తరణ పనులు చేపట్టారు. కాగా పనులను గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కూసు నరసింహమూర్తి మంగళవారం పరిశీలించారు. పరిశీలించిన వారిలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు తుపాకుల ప్రసన్నకుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పురంశెట్టి శ్రీను, నాయకులు వుండమట్ల శ్రీను, కూసు దొరాజీ, కుర్రా వీర్రాజు, మనుమర్తి యేసురాజు, కుర్రా సత్తిబాబు, బందెల సాయిరామ్, అబ్బిరెడ్డి వీర్రాజు పరిశీలించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర


విజయం సాధించిన అముజూరు జట్టుతో ప్రజాప్రతినిధులు, పీఈటీలు

కె.గంగవరం: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం హుషారుగా జరిగాయి. 7 సచివాలయల పరిధిలో పురుషులు, మహిళలకు కబడ్డీ, షటిల్, వాలీబాల్, కోకో, కబడ్డీ పోటీలు, క్రికెట్ పోటీలు నిర్వహించారు. పామర్రు, కె.గంగవరం, శివల, యర్రపోతవరం, భట్లపాలిక గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా ప్రాంగణాల్లో ఈ పోటీలు జరిగాయి. యువత హుషారుగా ఈ క్రీడా పోటీల్లో పాల్గొని గ్రామాల్లో సందడి చేశారు. పామర్రులో జరిగిన మండల స్థాయి పోటీల్లో అముజూరు గ్రామానికి చెందిన రెండు జట్లు తలబడ్డాయి. ఈ మ్యాచ్‌లో అముజూరు-2 టీం విజయం సాధించింది. విజయం సాధించిన టీం సభ్యులను సర్పంచ్ నానాపరపు కళ్యాణితో పాటు గ్రామ పెద్దలు అభినందించారు.